చీమలూ రైతులే

- భూమిపై వ్యవసాయం చేసిన తొలి జీవి చీమ
- మనుషుల కంటే 6.6 కోట్ల ఏండ్ల ముందే సేద్యం
- అమెరికా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రపంచానికి వ్యవసాయాన్ని పరిచయం చేసింది మనుషులేనని ఇప్పటివరకూ చెప్పుకొంటున్నాం. అయితే, మనుషులు పుట్టకముందే, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 6.6 కోట్ల ఏండ్ల కిందటే చీమలు వ్యవసాయాన్ని చేశాయి. ఇప్పటికీ చేస్తున్నాయి. అలా భూమి మీద వ్యవసాయం చేసిన తొలి జీవిగా చీమ నిలిచింది. ఈ విషయాన్ని అమెరికాలోని స్మిత్సోనియన్స్ నేషనల్ మ్యూజియమ్ ఆఫ్ నేచురల్ హిస్టరీ పరిశోధకులు తాజా అధ్యయనం ద్వారా గుర్తించారు. ఈ వివరాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆస్టరాయిడ్ ఢీకొట్టడంతో..

6.6 కోట్ల ఏండ్ల కిందట డైనోసార్లు భూమిపై సంచరించేవి. అప్పుడు ఖగోళంలో నుంచి దూసుకొచ్చిన ఓ భారీ ఆస్టరాయిడ్ భూమిని అత్యంత వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కొన్ని డైనోసార్లు మరణించాయి. మరోవైపు, ఆస్టరాయిడ్ ఢీకొట్టడంతో వాతావరణలోకి పెద్దఎత్తున ధూళి ఎగసింది. ఆ ధూళి మేఘం సూర్యరశ్మిని భూమికి చేరనీయకుండా అడ్డుకోవడంతో వాతావరణ మార్పులు జరిగి, ఆహారం దొరక్క మిగిలిన డైనోసార్లతో పాటు ఇతరత్రా జీవరాశులు కూడా అంతరించిపోయాయి. ఇదే సమయంలో చీమలు కూడా తమ ఆహారాన్ని సంపాదించుకోవడానికి వ్యవసాయాన్ని చేయడం ప్రారంభించాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

సాగు మొదలైంది ఇలా..

ఆస్టరాయిడ్ ఢీకొట్టిన ప్రభావంతో సూర్యరశ్మి లేకపోవడంతో మొక్కలు చనిపోయే స్థితికి చేరాయి. ఇటు చీమలకు కూడా ఆహారం దొరకని పరిస్థితి. దీంతో మొక్కల ఆకుల్లోని కొంతభాగాన్ని కత్తిరించిన చీమలు తాము నివాసం ఉండే పుట్టలోకి ఆ ఆకుల భాగాలను తీసుకువెళ్లాయని పరిశోధకులు గుర్తించారు. పంటలు పండించడానికి మనుషులు ఎలాగైతే విత్తనాలను సేకరిస్తారో.. తమ ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడానికి ఈ ఆకుల భాగాలను కూడా విత్తనాలు, ఎరువులుగా చీమలు వినియోగించుకొనేవని పరిశోధకులు పేర్కొన్నారు. అలా తీసుకెళ్లిన ఆకుల భాగాలను వెలుతురు సోకని ప్రదేశంలో కొంతకాలం ఉంచి శిలీంధ్రాలు ఏర్పడేలా చేసేవని, అలా ఏర్పడిన శిలీంధ్రాలను చీమలు ఆహారంగా తీసుకొనేవని తెలిపారు.

ఇప్పటికీ అలాగే..

అమెరికా, కరేబియన్ దీవుల్లో నివసించే లీఫ్‌కట్టర్ రకానికి చెందిన 250 రకాల చీమ జాతులు ఇప్పటికీ ఈ తరహా వ్యవసాయాన్నే చేస్తున్నాయని పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త టెడ్ షల్జ్ పేర్కొన్నారు. భూమిపై వ్యవసాయాన్ని చేసిన తొలి జీవులు చీమలేనని అభివర్ణించారు. 475 శిలీంధ్ర జాతులు, 276 రకాల చీమజాతులపై చేసిన జన్యుపరమైన విశ్లేషణల ఆధారంగా ఈ విషయాన్ని నిర్ధారించినట్టు పేర్కొన్నారు. కాగా, భూమి మీద మొదటి సర్జన్లుగా చీమలకు గుర్తింపు ఉండటం తెలిసిందే.

షుగర్ లెవల్స్ నిరంతరం పర్యవేక్షించే ఈసీజీ డివైజ్

సూది గుచ్చకుండానే గ్లూకోజ్ రీడింగ్స్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): మధుమేహం బాధితులు శరీరంలోని షుగర్ లెవల్స్ ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం అవసరం. దీని కోసం తరుచూ సూదితో గుచ్చుకొని శరీరాన్ని గాయపర్చుకోవడం వారికి ఇబ్బందిగా ఉంటుంది. అయితే, ఇలాంటి బాధలేకుండా సూదితో పనిలేకుండా ఈసీజీ రీడింగ్స్‌ను బట్టి శరీరంలో గ్లూకోజ్ లెవల్స్‌ను ఎప్పటికప్పుడు నిరంతరాయంగా తెలియజేసే వినూత్న పరికరాన్ని పరిశోధకులు అభివృద్ధి చేశారు. తైవాన్ ఇన్నోటెక్ ఎక్స్‌పో-2024లో ఈ పరికరాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. ఈ డివైజ్ అందించే ఈసీజీ రీడింగ్స్‌ను బట్టి నిరంతరాయంగా షుగర్ లెవల్స్‌లో మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించవచ్చని పరిశోధకులు తెలిపారు.

గ్లూకోజ్‌తో పాటు ఈ రీడింగ్స్ కూడా..

ఈ డివైజ్‌లో ఉన్న ప్రత్యేక సెన్సార్ రక్తంలోని గ్లూకోజ్ లెవల్స్‌ను నమోదు చేస్తుందని పరిశోధకులు తెలిపారు. ఈ డివైజ్ సాయంతో గ్లూకోజ్ లెవల్స్ మాత్రమే కాకుండా రక్తపోటు, గుండెకొట్టుకొనే వేగం, శ్వాసతీసుకొనే వేగం, శరీర ఉష్ణోగ్రతల సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

మొక్కలూ మాట్లాడతాయ్!

లండన్: మొక్కలకు జీవం ఉంటుందనేది అందరికీ తెలిసిన విషయమే. మన మాటలు, శబ్దాలకు మొక్కలు ప్రతిస్పందిస్తాయని కూడా పలువురు శాస్త్రవేత్తలు చెప్తుంటారు. ఇప్పుడు మొక్కలు మనతో తిరిగి మాట్లాడే కొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సాయంతో యూకేకు చెందిన టామ్ మెస్సే, జె అహ్న్ అనే ఇద్దరు గార్డెనర్లు దీనిని తయారుచేశారు. దీనిని వచ్చే ఏడాది జరగనున్న ఓ కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. మొక్కలు పెంచే తోటలోని మట్టిలో సెన్సార్లు అమర్చడం ద్వారా ఈ సాంకేతికత పని చేస్తుందని మెస్సే తెలిపారు. ఈ సెన్సార్లు మట్టిలో తేమ, పోషకస్థాయిలు, ఆమ్లత, క్షారత్వాన్ని గుర్తించి అక్కడే అమర్చే కంప్యూటర్‌కు చేరవేస్తాయి. ఫోన్‌లోని ఓ ప్రత్యేక యాప్‌తో ఈ కంప్యూటర్‌ను అనుసంధానం చేస్తారు. ఏఐ సాయంతో ఈ యాప్ పని చేస్తుంది. 'ఎలా ఉన్నావు?', 'నీరు పోయాలా?' వంటి ప్రశ్నలను యాప్ ద్వారా అడిగితే, తోట సమాధానాలు ఇస్తుందని మెస్సే చెప్పారు.

అర్ధ రూపాయి చెల్లించనందుకు

రూ.15,000 ఫైన్

ఇండియా పోస్ట్‌కు షాక్ ఇచ్చిన వినియోగదారుల ఫోరం

చెన్నై: వినియోగదారు నుంచి 50 పైసలు అదనంగా తీసుకున్న ఇండియన్ పోస్ట్‌కు వినియోగదారుల ఫోరం గట్టి షాక్ ఇచ్చింది. 50 పైసలతోపాటు నష్ట పరిహారం కింద రూ.10,000; వ్యాజ్య ఖర్చుల కోసం రూ.5,000 చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదుదారు ఏ మానసతన ఫిర్యాదులో చేసిన ఆరోపణల ప్రకారం, ఆయన 2023 డిసెంబరు 13న పొజిచలూర్ పోస్టాఫీసులో రిజిస్టర్డ్ లెటర్ బుక్ చేశారు. దానికి పోస్టాఫీసు ఇచ్చిన రశీదులో రూ.29.50 వసూలు చేసినట్లు తెలిపింది. కానీ ఆయన వద్ద నుంచి రూ.30 వసూలు చేసింది. తాను డిజిటల్ పేమెంట్ చేస్తానని ఆయన చెప్పినప్పటికీ, సాంకేతిక కారణాలను చూపి అధికారులు తిరస్కరించారు. దీనిపై వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్తూ, సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా 50 పైసలును అదనంగా వసూలు చేయడం అనుచిత వ్యాపార విధానమని, ఇది సేవా లోపమేనని తెలిపింది.

ఒక్కో పార్టీ 85 స్థానాల్లో పోటీ

ఎంవీఏ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారు

ముంబై, అక్టోబర్ 23: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాలపై విపక్ష కూటమి 'మహా వికాస్ అఘాడీ'(ఎంవీఏ)లో పార్టీల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి. కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్‌పవార్), శివసేన(యూబీటీ).. ఒక్కో పార్టీ 85 స్థానాల్లో పోటీ చేయడానికి అంగీకారం కుదిరిందని బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. ముంబైలో ఎంపీ సంజయ్ రౌత్ విలేకర్లతో మాట్లాడుతూ, 'మొత్తం 288 స్థానాలకుగాను 270 స్థానాల్లో అంగీకారం కుదిరింది. సమాజ్‌వాదీ, పీడబ్ల్యూపీ, సీపీఐ, సీపీఎం, ఆప్‌తో కలిసి ఎన్నికల బరిలో దిగాలని భావిస్తున్నాం' అని అన్నారు.

బియ్యం ఎగుమతులపై ఆంక్షల తొలగింపు

న్యూఢిల్లీ: బియ్యం ఎగుమతులపై ఆంక్షలను తొలగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. బాస్మతియేతర తెల్ల బియ్యంపై ఉన్న కనీస ఎగుమతి ధర (టన్నుకు 490 డాలర్లు)ను తొలగిస్తున్నట్టు తెలిపింది. పారాబాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం), బ్రౌన్ రైస్‌లకు ఎగుమతి సుంకాన్ని కూడా కేంద్రం తొలగించింది. అంతకుముందు వీటిపై 10% ఎగుమతి సుంకం ఉండేది. ఈ తగ్గింపు ఈ నెల 22 నుంచి అమలులోకి వస్తుంది. గత నెలలో ప్రభుత్వం బాస్మతియేతర బియ్యంపై ఎగుమతి సుంకాన్ని మినహాయించిన సంగతి తెలిసిందే. అలాగే పారాబాయిల్డ్, బ్రౌన్, వరి బియ్యం లెవీని 20 నుంచి 10 శాతానికి తగ్గించడమే కాక, బాస్మతి బియ్యం కనీస ఎగుమతి ధర ను కూడా కేంద్రం రద్దు చేసింది.

వందేభారత్ స్లీపర్ కోచ్‌ల ఆవిష్కరణ

చెన్నై: పూర్తిగా మెరుగుపర్చిన భద్రత, సౌకర్యాలతో తయారు చేసిన వందే భారత్ స్లీపర్ కోచ్‌లను చెన్నైలోని ఇంటీగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) బుధవారం ఆవిష్కరించింది. ఐసీఎఫ్‌లో 2018 నుంచి తయారవుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు దేశవ్యాప్తంగా 77 వివిధ మార్గాల్లో నడుస్తున్నాయి. అయితే ఇప్పటివరకు తయారు చేసిన వందేభారత్ కోచ్‌లు కేవలం కూర్చునేందుకు వీలుగా చైర్ కార్ సౌకర్యంతోనే నిర్మించారు. అయితే రాత్రి వేళల్లో కూడా దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేందుకు వీలుగా పూర్తి ఏసీ కోచ్‌లతో వందేభారత్ స్లీపర్ కోచ్‌లను ఐసీఎఫ్ తయారు చేస్తున్నది. ఈ స్లీపర్ కోచ్‌లలో జీఎఫ్ఆర్‌పీ ప్యానెల్స్, సుఖవంతమైన కుషన్ ఫోమ్‌తో బెర్త్‌లు, వ్యాక్యూమ్ టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేసి ప్రయాణాన్ని సుఖవంతంగా, ఆహ్లాదకరంగా చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభకు జరిగే ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ బుధవారం నామినేషన్ వేశారు. తొలిసారిగా క్రియాశీల రాజకీయాల్లో నేరుగా పోటీ చేస్తున్న ఆమె నామినేషన్‌కు ముందు కాల్‌పెట్టా, తాంకెడ్‌లలో భారీ రోడ్ షో నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమంలో ఆమె వెంట తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. కాగా, తనకు 12 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో ప్రియాంక తెలిపారు.

బీజేపీ కంచుకోట బద్దలవుతుందా?

- ఎన్నికల్లో కీలకంగా మారిన ఉత్తర మహారాష్ట్ర
- పట్టు నిలుపుకునేందుకు కమలం ఆరాటం
- ఆధిక్యం కోసం ఎంవీఏ కూటమి వ్యూహాలు

ముంబై, అక్టోబర్ 23: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపునకు మహాయుతి, మహావికాస్ అఘాడీ కూటములు వ్యూహాలకు పదునుపెట్టాయి. రెండు కూటముల్లో సీట్ల సర్దుబాటు దాదాపు కొలిక్కి వస్తున్నది. అభ్యర్థుల ప్రకటనతో ప్రచార పర్వం ఊపందుకుంటున్నది. ఈ క్రమంలో ఉత్తర మహారాష్ట్రలో ఈసారి ఫలితాలు ఏ విధంగా ఉంటాయన్నదానిపై అందరి దృష్టి నెలకొంది. తమకు కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో పట్టు నిలుపుకునేందుకు అధికార బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అయితే ఈసారి ఎలాగైనా ఆధిక్యం సాధించాలని కాంగ్రెస్ కూటమి ప్రణాళికలు రచిస్తున్నది. 47 సీట్లతో ప్రధానంగా వ్యవసాయ ఆధారితంగా ఉన్న ఈ ప్రాంతంలో రైతుల ప్రాబల్యం ఎక్కువ. ధులే, నందుర్బార్, జల్గావ్, నాసిక్, అహల్యానగర్ జిల్లాలు ఈ ప్రాంతం కిందకు వస్తాయి.

2019 ఎన్నికల్లో మొత్తం 47 సీట్లలో బీజేపీ 16, అవిభాజిత నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 13, కాంగ్రెస్ ఏడు, అవిభాజిత శివసేన ఆరు, ఏఐఎంఐఎం రెండు, స్వతంత్రులు ఇద్దరు, క్రాంతికారీ షెత్కారీ పక్ష్ ఒక స్థానం గెల్చుకున్నాయి. అనంతరం రాజకీయంగా ప్రధాన పార్టీల్లో పెను మార్పులు చోటుచేసుకోవడంతో అప్పటి పరిస్థితులు పునరావృతం అయ్యే అవకాశాలు కన్పించడం లేదు.

చీలిక అనంతరం రాజకీయంగా పెనుమార్పులు

2022 జూన్‌లో శివసేన, 2023 జూలైలో ఎన్సీపీల్లో చీలిక వచ్చింది. శివసేన చీలిక వర్గానికి ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ చీలిక వర్గానికి అజిత్ పవార్ నేతృత్వం వహించగా, వారిద్దరూ ప్రస్తుతం బీజేపీ కూటమిలో భాగస్వాములుగా ఉన్నారు. శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్‌పవార్), కాంగ్రెస్ మహావికాస్ అఘాడీగా ఉన్నాయి. ఈ రాజకీయ చీలిక అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చాయి. ప్రధాన పార్టీలను చీల్చడాన్ని ప్రజలు ఇష్టపడలేదని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 12 సీట్లలో బీజేపీ నాలుగింటిని కోల్పోయింది. ధులే, దిండోరి, నందుర్బార్, అహల్యానగర్‌లను శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్‌పీ) కూటమి గెల్చుకోగా, జల్గావ్, రావెర్ స్థానాలను బీజేపీ నిలబెట్టుకుంది.

బీజేపీపై వ్యతిరేకత

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులు సమస్యలు, మరాఠా-ఓబీసీ ఆందోళనలు ప్రధాన అంశాలుగా నిలిచినట్టు రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. 1999లో కాంగ్రెస్ నుంచి శరద్‌పవార్ వేరుపడిన తర్వాత నాసిక్ ప్రాంతంలో కాంగ్రెస్ పూర్తిగా బలహీనపడిందని ఆ పార్టీ సీనియర్ నేత రాజారామ్ పంగ్వానే తెలిపారు. ప్రస్తుతం తాము నాసిక్‌లో పోటీ చేయడం లేదని, అక్కడ సేన-ఎన్సీపీతో బీజేపీ పోటీ పడుతుందని చెప్పారు. అయితే తాము నందుర్బార్, ధులే, అహల్యానగర్‌లపై దృష్టి సారించినట్టు చెప్పారు. ద్రవ్యోల్బణం, అవినీతి, మరాఠా-ఓబీసీ అంశాలను ప్రధానంగా ప్రస్తావించనున్నట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ పరిస్థితిలో ఏమీ మార్పు లేదని, ఆ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, అయితే బీజేపీ నిర్వహణా సామర్థ్యం కారణంగా ఆ పార్టీకి ఎడ్జ్ ఉందని ఎన్సీపీ (శరద్‌పవార్) సీనియర్ నేత ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు.

రైతుల్లో అసంతృప్తి

ఉల్లిగడ్డల ఎగుమతిపై నిషేధం తొలగించినప్పటికీ రైతుల పరిస్థితిలో ఏమీ మార్పు రాలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వారు తీవ్రంగా నష్టపోయారు. పత్తి, సోయాబీన్‌కు సరైన ధరలు రాలేదు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నాటి నుంచి ఉల్లి రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్ గిగ్‌హోల్ తెలిపారు. వారికి రూ.25 కోట్ల సబ్సిడీ మొత్తం ఇంకా అందాల్సి ఉందన్నారు. ఎగుమతి సుంకాన్ని పూర్తిగా తొలగించాలని కోరుతున్నారన్నారు. సోయాబీన్‌కు కనీస మద్దతు ధర కన్నా తక్కువే లభించడం పట్ల రైతులు అసంతృప్తి చెందుతున్నారు.

చర్చలు, దౌత్యానికే మా మద్దతు

- ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు వద్దు
- బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ

కజన్, అక్టోబర్ 23: వివాదాలను పరిష్కరించుకునేందుకు చర్చలు, దౌత్యం మాత్రమే పరిష్కారమార్గమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. రష్యాలోని కజన్‌లో జరుగుతున్న 16వ బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సులో మోదీ ప్రసంగించారు. 'చర్చలు, దౌత్యానికే మా మద్దతు ఉంటుంది. యుద్ధానికి మద్దతివ్వం.' అని ఆయన పేర్కొన్నారు. 'వివాదాలు, ప్రతికూల వాతావరణ ప్రభావాలు, సైబర్ ముప్పు వంటి అనేక సవాళ్ల నడుమ జరుగుతున్న బ్రిక్స్ సదస్సుపై చాలా అంచనాలు ఉన్నాయి.' అని అన్నారు. 'ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదానికి నిధులు సమకూరకుండా అడ్డుకునేందుకు మాకు అందరి బలమైన మద్దతు కావాలి. ఈ తీవ్రమైన అంశంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదు' అని బ్రిక్స్ సభ్య దేశాలకు పిలుపునిచ్చారు.

గాజాలో కాల్పులు విరమించాలి: బ్రిక్స్

గాజాలో తక్షణ, శాశ్వత కాల్పుల విరమణకు బ్రిక్స్ సదస్సు పిలుపునిచ్చింది. ఈ మేరకు 'కజన్ డిక్లరేషన్' చేసింది. 'గాజా, వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ మిలిటరీ చర్యలతో ప్రజల సామూహిక హత్యలు జరుగుతున్నాయి. వెంటనే కాల్పులు విరమించడంతో పాటు ఇరు వైపులా బందీలను విడిచిపెట్టాలి' అని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు.

గస్తీ ఒప్పందానికి మోదీ, జిన్‌పింగ్ ఆమోదం

భారత్ - చైనా మధ్య శాంతియుత, సుస్థిర సంబంధాలు ఉండాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బుధవారం అంగీకరించారు. పరిపక్వత, పరస్పర గౌరవంతో సత్సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించారు. ఐదేండ్ల తర్వాత బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ మధ్య 50 నిమిషాల పాటు ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. తూర్పు లఢక్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గస్తీ నిర్వహణ ఒప్పందం కుదుర్చుకున్నారు. సరిహద్దు వివాదంపై ఆగిపోయిన ప్రత్యేక ప్రతినిధుల చర్చలను మళ్లీ ప్రారంభించాలని ఇరువురు నిర్ణయం తీసుకున్నారు.

మ్యారిటల్ రేప్ కేసు విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ

న్యూఢిల్లీ: మ్యారిటల్ రేప్ కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం వైదొలగారు. ఐపీసీ సెక్షన్ 375లోని రెండో మినహాయింపును రద్దు చేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. వీటిపై విచారణ సమీప భవిష్యత్తులో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. భార్య సమ్మతి లేకుండా ఆమెతో శృంగారంలో పాల్గొన్న భర్తపై అత్యాచారం కేసు నమోదు చేయకుండా మినహాయింపు ఇవ్వడం మహిళల హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషనర్లు వాదిస్తున్నారు. దీపావళి సెలవులకు ముందే తీర్పు చెప్పాలని తాను భావించానని, అయితే సమీప భవిష్యత్తులో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని సీజేఐ తెలిపారు. అనంతరం తదుపరి విచారణను నాలుగు వారాలకు ధర్మాసనం వాయిదా వేసింది. సీజేఐ చంద్రచూడ్ వచ్చే నెల 11న పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన పదవీ కాలంలో చివరి పని దినం వచ్చే నెల 8.

గాజా పునర్నిర్మాణానికి 350 ఏండ్లు

ఐక్యరాజ్యసమితి నివేదిక అంచనా

గాజా, అక్టోబర్ 23: ఇజ్రాయెల్ దిగ్బంధనంలో కొనసాగితే గాజాను పునర్నిర్మించేందుకు 350 ఏండ్లు పట్టవచ్చని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి కాన్ఫరెన్స్ నివేదిక అంచనా వేసింది. 2007లో గాజాలో హమాస్ అధికారాన్ని చేపట్టిన తర్వాత ఇజ్రాయెల్, ఈజిప్ట్ ఈ ప్రాంతాన్ని దిగ్బంధించాయి. హమాస్‌కు ఆయుధాలు సరఫరా కాకుండా గాజాను ముట్టడించామని చెబుతున్న ఇజ్రాయెల్ గాజా నుంచి పూర్తిగా వెనక్కు వెళ్లేందుకు సిద్ధంగా లేదు. 2007-2022 మధ్యకాలంలో గాజాలో జీడీపీ వృద్ధి రేటు సగటున 0.4 శాతం ఉందని ఈ నివేదిక పేర్కొన్నది. ఈ లెక్కన ఇప్పటికిప్పుడు ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ జరిగినా, ఇజ్రాయెల్ దిగ్బంధనం కొనసాగితే గాజా ఆర్థిక వ్యవస్థ యుద్ధం ముందు నాటి స్థితికి చేరుకునేందుకు 350 ఏండ్లు పట్టొచ్చని పేర్కొన్నది. అనూహ్య పరిస్థితుల్లో ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం నమోదైనా గాజా కోలుకునేందుకు దశాబ్దాలు పడుతుందని తెలిపింది. కాగా, గాజాలోని నిర్మాణాల్లో పావు వంతు పూర్తిగా ధ్వంసమయ్యాయని గత నెల ఐరాస అంచనా వేసింది. 66 శాతం నిర్మాణాలు పాక్షికంగా ధ్వంసమైనట్టు శాటిలైట్ ఫుటేజ్ ద్వారా గుర్తించింది. గాజాలో ధ్వంసమైన ఇండ్లను మళ్లీ నిర్మించేందుకు దాదాపు 40 ఏండ్లు పట్టొచ్చని షెల్టర్ క్లస్టర్ అనే సంస్థ అంచనా వేసింది.

నస్రల్లా వారసుడు సఫీయుద్దీన్ హతం

హెజ్బొల్లా అగ్రనేతల అంతమే లక్ష్యంగా దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ మరో విజయం సాధించింది. గత నెలలో జరిపిన దాడుల్లో హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాను చంపిన అనంతరం ఆయన స్థానంలో వారసునిగా బాధ్యతలు చేపడతారని భావించిన మరో నేతను కూడా తాము ఈ నెలలో బీరుట్ ఆవల హతమార్చినట్టు ఇజ్రాయెల్ మంగళవారం తెలిపింది. అయితే సఫీద్దీన్ మృతి గురించి హమాస్ ఎలాంటి ప్రకటన చేయలేదు. గత వారం హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు హతమార్చిన విషయం తెలిసిందే. కాగా, ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న యూఎస్ స్టేట్ సెక్రటరీ ఆంటోని బ్లింకెన్ మాట్లాడుతూ సిన్వర్ మృతిని ఇజ్రాయెల్ తమకు అనుకూలంగా మలచుకుని గాజాతో యుద్ధానికి ముగింపు పలకాలని, అలాగే హమాస్ చేతిలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ వాసులను సురక్షితంగా విడుదల చేయించాలని సూచించారు.

స్పిరిట్‌పై రాష్ట్రాలకే నియంత్రణ

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: ఇండస్ట్రియల్ ఆల్కహాల్ (స్పిరిట్) ఉత్పత్తి, తయారీ, సరఫరాపై నియంత్రణ అధికారం రాష్ట్రాలకే ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనంలో ఎనిమిది మంది అనుకూలంగా, ఒకరు మాత్రమే వ్యతిరేకంగా ఈ తీర్పును వెలువరించారు. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూలులో పేర్కొన్న రాష్ట్రాల జాబితాలోని 8వ అంశంలో పేర్కొన్న 'మత్తు కలిగించే మద్యం'లోనే పారిశ్రామిక మద్యం (స్పిరిట్) కూడా ఇమిడి ఉంటుందని వివరించింది. ధర్మాసనంలోని సీజేఐ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు హృషికేష్ రాయ్, అభయ్ ఓకా, జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రా, ఉజ్జల్ భూయాన్, సతీశ్ చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మసీహ వెలువరించిన తీర్పుతో జస్టిస్ బీవీ నాగరత్న విభేదించారు. 95 శాతం ఇథనాల్ ఉంటే ఇథైల్ ఆల్కహాల్‌ను పారిశ్రామిక మద్యం అని అంటారు. దీనిని మత్తు పానీయంగా వినియోగించడం సాధ్యం కాదు.

పర్యావరణ చట్టాలకు కోరలు పీకేశారు

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణ చట్టాలకు కోరలు పీకేసి నిర్వీర్యం చేశారంటూ కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. పంట వ్యర్థాలను తగలబెడితే జరిమానా విధించే 'కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఇన్ నేషనల్ క్యాపిటల్ రీజియన్ అండ్ అడ్జర్నింగ్ ఏరియాస్ యాక్ట్ (సీఏక్యూఎం)'ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రూపొందించకుండానే ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కోసం కమిషన్‌ను రూపొందించారంటూ ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతం అవుతున్నది. ప్రతి ఏడాది ఇదే సమస్య ఎదురవుతున్నప్పటికీ సీఏక్యూఎం అమలుకు పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

బంగ్లాదేశ్‌లో మళ్లీ నిరసనలు

- అధ్యక్షుడి రాజీనామా కోసం డిమాండ్
- అధ్యక్ష భవనం ముట్టడి
- హసీనా రాజీనామా లేఖపై వివాదం

ఢాకా, అక్టోబర్ 23: బంగ్లాదేశ్‌లో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దిన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ రాజధాని ఢాకాలో నిరసనలు మొదలయ్యాయి. మంగళవారం రాత్రి వందలాదిగా నిరసనకారులు అధ్యక్ష భవనమైన బంగభవన్‌ను ముట్టడించారు. వెంటనే షహబుద్దిన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు